# తెగులు.. దిగులు

- వరిపైరుకు ఆశించిన తెగుళ్లు
- ఆందోళనలో అన్నదాతలు

రఘునాథపల్లి: యాసంగి వరి సాగు చేసిన అన్నదాతలకు ఆదిలోనే తెగుళ్ల ఆశించడంతో దిగులు చెందుతున్నారు. ఎప్పుడూ లేని విధంగా పలు రకాల తెగుళ్లతో వేసిన నాట్లు వేసినట్టే ఉన్నాయి, వాటి నియంత్రణకు రసాయన మందులను వినియోగించినప్పటికీ ప్రయోజనం లేదు. కొందరు రైతులు పంటను దున్ని కొత్తగా మళ్లీ నాట్లు వేస్తున్నారు. మరి కొందరు రైతులు ఏమి చేయాలో పాలుపోక నిస్సహాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలో ఈ రబీలో దాదాపు 14 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. వరి పంట సాగుకు ఇప్పటికే ఎకరాకు రూ.25 వేల ఖర్చయిందని వాపోతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఆకులు పసుపు వర్ణంలోకి మారి పైరు ఎండిపోతుంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో నాటు దశలోనే మొగి పురుగు ఉధృతి పెరగడంతో కుదుర్లు నలుపు రంగులోకి మారి బియ్యం గింజ పరిమాణంలో లార్వా వ్యాపిస్తోంది. జింక్ లోపం, ఒకేసారి తెగుళ్లు ఆశించి తీరని నష్టాన్ని కలిగిస్తున్నాయి. రూ.లక్షల పెట్టుబడిపెట్టగా దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఫతేషాపూర్‌లో తెగులు సోకిన వరి పైరు

### తెగుళ్లతో అదనపు పెట్టుబడి



ఐదు ఎకరాల్లో వేసిన వరి నాట్లు వేసినట్లే ఉన్నాయి. పొలానికి ఎప్పుడూ లేని విధంగా తెగుళ్లు సోకడంతో అదనంగా పెట్టుబడి అవుతోంది. ఇప్పటికే రెండు సార్లు రసాయనిక మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేదు. మూడు ఎకరాల నాటు తెగుళ్లతో పూర్తిగా దెబ్బతినగా మళ్లీ దున్ని కొత్తగా నాటు వేయాలి. తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలి.

– మేకల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, రఘునాథపల్లి

### అధికారుల సూచనలు పాటించాలి



వరి పైరులో సస్యరక్షణ చర్యలు పాటించడంతో పాటు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. వాతావరణం మార్పుల వల్ల తెగుళ్లు సోకుతున్నాయి. నాటు వేసిన 15 రోజులకు ఎకరాకు 4 కేజీల క్లోరోంత్రానిలిప్రోలు గుళికలు వేయాలి. ప్రస్తుతం ఎకరాకు 60 గ్రాముల క్లోరోంత్రానిలిప్రోలు మందు పంటపై పిచికారీ చేయాలి.

– కె. శ్రీనివాస్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, రఘునాథపల్లి

## కేసీఆర్ కృషితో ఇంటింటికి 'కంటి వెలుగు'



జనగామ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



బచ్చన్నపేట: కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సుశీల

జనగామ రూరల్: సీఎం కేసీఆర్ కృషితో కంటి వెలుగు కార్యక్రమం ఇంటింటికి చేరిందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెంబర్తిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ అంబాల ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు గడగడపకు అందించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. గ్రామంలో 15 రోజుల పాటు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు అందజేస్తారని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని, ఉచితాలు బంద్ చేయమనడం సమంజసం కాదన్నారు. అనంతరం ఎంపీపీ మేకల కళింగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వసంత, ప్రత్యేక అధికారి ఎస్సీ కార్పొరేషన్ అధికారి వెంకన్న, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ హసీం, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయసిద్ధిలింగం, ఎంపీటీసీ మూల రవి, ఉప సర్పంచ్ రేఖ, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

**'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి**

బచ్చన్నపేట: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని నక్కవానిగూడెం, గంగాపూర్ సర్పంచ్‌లు ఏలూరి మాధవి, బందారం సుశీల అన్నారు. మంగళవారం జీపీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిబిరాల్లో కంటి పరీక్షలను నిర్వహించి ఉచిత అద్దాలను అందిస్తారని, దశల వారిగా అన్ని గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి, ఉప సర్పంచ్ పిట్టల ఇస్తారి, వైద్యులు రమ్య, రామానుజాచారి, ప్రవీణ హబీబ్, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశలు, ఏఎన్ఎంలు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**కంటివెలుగుపై కళాకారుల ప్రదర్శన**

రఘునాథపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు మండలంలోని రఘునాథపల్లి, ఇబ్రహీంపూర్‌లో కళా ప్రదర్శన నిర్వహించారు. కంటి వెలుగులో ఉచితంగా కంటి అద్దాలు, మందులు అందిస్తారని వివరించారు. కళాకారులు సంజీవ, జనగామ శంకర్, బాలయ్య, సోమయ్య ఉన్నారు.

## క్లుప్తంగా

### బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ శ్రీ సిద్దేశ్వరాలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. 18వ తేదీన మహాశివ రాత్రి పర్వదినం రోజున శివపార్వతుల కల్యాణం, 19న ఉదయం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికృపకు పాత్రులు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ చిందం వంశీ, అర్చకులు ఓం నమశివాయ, సదాశివుడు, మహాశివుడు, ఆయల సిబ్బంది చల్ల రాజేందర్‌రెడ్డి, మధు, లక్ష్మీకాంత్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పాలకుర్తి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.6,79,800 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ప్రజాప్రతినిధులు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, బీఎస్పీ అధ్యక్షుడు నవీన్, మాచర్ల ఎల్లయ్య, ఎం.డి సర్వర్ ఖాన్, ఎడవెల్లి పురుషోత్తం, కర్నాకర్‌రెడ్డి, అనుముల అంజిరావు పాల్గొన్నారు.

### ఎన్నిక



రఘునాథపల్లి: మండలంలోని గోవర్ధనగిరిలో శ్రీవేణుగోపాలస్వామి పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం సభ్యులు మంగళవారం సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా దుస్సా మహేందర్, డైరెక్టర్లుగా సంపత్ వెంకట్‌రెడ్డి, మునిగాల మల్లేష్, సంపత్, మహిపాల్‌రెడ్డి, ముప్పిడి రాజు, సాంబరాజు, ఉల్లికుమార్, అరవింద్, శివకుమార్, అరుణ, గట్టయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### సీపీఐ నియోజకవర్గ ఎన్నికల కార్యదర్శిగా రమేష్



జఫర్‌గఢ్: మండలంలోని మగ్దుంతండా శివారు అవుసులతండాకు చెందిన సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేష్ ఆ పార్టీ నియోజకవర్గ ఎన్నికల కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా పార్టీ ఎన్నికల నియోజకవర్గ స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రమేష్ విలేకరులతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

### వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: భారత కరెన్సీపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ చేపడుతున్న ప్రజా పోరుయాత్ర వాల్ పోస్టర్‌ను సమితి సభ్యులు జనగామ చౌరస్తాలో మంగళవారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 1వ తేదీన విశాఖపట్నం నుంచి చేపడుతున్న ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కమిటీ సభ్యులు కచ్చిగల్ల నాగరాజు, కనకరాజు, మహేందర్, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అందుబాటులో లేని డీలర్‌ను సస్పెండ్ చేయాలి

బచ్చన్నపేట: చిన్నరామన్‌చర్ల రేషన్ డీలర్ శ్రీనివాస్ అందుబాటులో ఉండడం లేదని వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు రామగళ్ల అశోక్ అన్నారు. మంగళవారం గ్రామంలో రేషన్ షాపు ఎదుట గ్రామస్తులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ శ్రీనివాస్ గ్రామంలో నివాసం ఉండడం లేదని, కనీసం 15 రోజులకు ఒక్క సారి కూడా గ్రామానికి రావడం లేదని, రేషన్ సరుకుల పంపిణీ సరిగా చేయడం లేదన్నారు. దీంతో గ్రామంలోని లబ్ధిదారులు బియ్యం, సరుకులకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే డీలర్‌ను సస్పెండ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి భానుచందర్‌కు వినతి పత్రం అందించారు. కాగా, గ్రామానికి వచ్చిన డీలర్ శ్రీనివాస్ సరుకులను ఇక నుంచి సక్రమంగా పంపిణీ చేస్తానని గ్రామస్తులకు లిఖిత పూర్వకంగా పత్రాన్ని రాసి ఇచ్చాడు. గ్రామ శాఖ కార్యదర్శి బుర్రి సుధాకర్, నాయకులు మణి, రవీందర్‌రెడ్డి, రాజు, శైలజ, నాగరాజు పాల్గొన్నారు.

## వైభవంగా ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో సీతారామచంద్ర స్వామి, శ్రీరామనాథ ఆలయం ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం రెండోరోజు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మోహనకృష్ణభార్గవ, వేదపండుతులు సుదర్శన యజ్ఞం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, ఫల, శయ్యాధివాసం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, పేరిణి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నర్సిరెడ్డి, మల్లారెడ్డి, శ్రీశైలం, కృష్ణమూర్తి, సత్యనారాయణ, రాంప్రసాద్, నాగరాజు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ వితరణ



జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు మా ఇల్లు అనాథ ఆశ్రమం ద్వారా వీజీఎస్ పబ్లికేషన్స్ వారి స్టడీ మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు మా ఇల్లు ఆశ్రమ నిర్వాహకులు గాదె ఇన్నయ్య పుష్ప దంపతులు స్టడీ మెటీరీయల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందజేయడం జరుగుతున్నదని చెప్పారు. ఉపాధ్యాయులు రమేష్‌బాబు, చంద్రమోహన్, రవి, గిరిజ, ప్రభాకర్, స్వరూపరాణి, అనిల్, వేణు, విజయశ్రీ, సిరాజ్, కరుణశ్రీ, శంకర్, ఉమా, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పల్లె రాజిరెడ్డి పాల్గొన్నారు.

## వైఎస్సార్‌టీపీని బలోపేతం చేయండి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు గౌరబోయిన సమ్మయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: వైఎస్సార్‌టీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు పాటుపడాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గౌరబోయిన సమ్మయ్య అన్నారు. మండలంలోని ఇప్పగూడెంలో పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సంగాల యిర్మియా ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు జిల్లా అధ్యక్షుడి సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. అనంతరం గ్రామంలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామాల్లో ఇప్పటికీ గతంలో దివంగత సీఎం, మహనేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే కనిపిస్తున్నాయన్నారు. వైఎస్సార్ ఆశయసాధనే లక్ష్యంగా వైఎస్సార్‌టీపీ పనిచేస్తుందని అన్నారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊరడి శ్రీనివాస్, దారం మనోహర్, బాబు, జగన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## పంటల సాగులో మెళకువలు పాటించాలి



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న దీప్తి

జఫర్‌గఢ్: పంటల సాగులో రైతులు తప్పనిసరిగా మెళకువలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి దేవర దీప్తి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వరి సాగుతో పాటు ఇతర పంటలకు ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు రైతులు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. పంటలకు ఎలాంటి తెగుళ్లు ఆశించినా వెంటనే సంబంధిత ఏఈఓల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వెంటనే నివారణ చర్యలు చేపట్టినట్లయితే పంటకు నష్టం జరగకుండా నివారించవచ్చునని పేర్కొన్నారు. రైతు గ్రామ కోఆర్డినేటర్ సోమశేఖర్, ఏఈఓ శిరీష పాల్గొన్నారు.



పాలకుర్తి టౌన్: అవగాహన కల్పిస్తున్న అధికారులు

**డ్రోన్ స్ప్రేతో రైతులకు తగ్గనున్న ఆర్థికభారం**

పాలకుర్తి టౌన్: డ్రోన్ స్ప్రేతో రైతులకు ఆర్థిక భారం తగ్గుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారిపెద్దిరెడ్డి వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని ఈరవెన్నులో డ్రోన్ స్ప్రే వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రోన్ స్ప్రేతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయవచ్చన్నారు. ప్రతీ మొక్కకు మందు అందుతుందని, రైతులు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ఏఈఓ శ్రావణి, ఉప సర్పంచ్ ఐలమ్మ, రైతులు కొడిశాల బాబు, వెంకన్న, దామోదర్ పాల్గొన్నారు.

## గుడిసెవాసులపై దాడులు ఆపాలి

చిల్పూరు: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలపై అధికారులు దాడులు నిలిపివేసి వారికి పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎన్నకూస కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన ఇళ్లులేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని చెప్పిన నాయకులు నేటికీ ఇవ్వకపోవడంతో ప్రభుత్వభూముల్లో గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి వారికి న్యాయం చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**అధికారులతో గుడిసెవాసుల వాగ్వాదం**

తహసీల్దార్ విమల ఆదేశం మేరకు ఆర్ఐ కల్వల శ్రీనివాస్ అక్కడికి చేరుకొని వెంటనే ఖాళీ చేయాలని లేకుంటే కేసులు తప్పవని తెలిపారు. దీంతో గుడిసెవాసులు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

## జీవాలను పత్తి పంటలో మేపొద్దు



లింగాలఘణపురం: ప్రస్తుతం గొర్రెలు, మేకలను పత్తిలో మేపొద్దని మండల పశువైద్యాధికారి అనిత తెలిపారు. పత్తి తీసివేయడం పూర్తికావడంతో ఆ పంటలో మేపడం వల్ల గొర్రెలు, మేకల్లో ఊరిపితిత్తులు, కాలేయం, కిడ్నీలు దెబ్బతిని మృతి చెందుతున్నాయని చెప్పారు. ఇటీవల నెల్లుట్లలో మరాటి మల్లయ్యకు చెందిన గొర్రెపిల్ల మృతిచెందడంతో పోస్టుమార్టం నిర్వహించడం జరిగిందని, అందులో బీటీ పత్తి మేపడంతోనే ఇలా జరిగిందని వివరించారు.

**పశువులకు వ్యాక్సినేషన్**

మండలంలోని పశువులకు భవిష్యత్‌లో గర్భస్రావం కాకుండా వ్యాక్సిన్ వేస్తున్నామని పశువైద్యాధికారి అనిత తెలిపారు. ఈ మేరకు మంగళవారం నెల్లుట్లలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4–7 నెలల దూడలకు వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మండల కేంద్రంలో కళాశాల ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

లింగాలఘణపురం: మండలానికి మంజూరైన ప్రభుత్వ జూనియర్ కాలేజీని మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని పూర్వ విద్యార్థులు మంగళవారం ఎంపీపీ చిట్ల జయశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజయ్య దృష్టికి తీసుకెళ్లి మండల కేంద్రంలోనే ఏర్పాటయ్యే విధంగా చూస్తానని చెప్పారు. సర్పంచ్ విజయ్‌మనోహర్, ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి ఉపేందర్, నాయకులు కుమారస్వామి, వీరయ్య, రాజు, యాకయ్య, లక్ష్మీనారాయణ, రవి, ఆగయ్య, మల్లేశం, శ్రీనివాస్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## మత్స్యకార్మికులకు బీమాపత్రాల అందజేత



బీమా పత్రాలతో మత్స్యకార్మికులు

దేవరుప్పుల: జాతీయ చేపల పెంపకం బోర్డు సౌజన్యంతో మత్స్యకార్మికులకు మంజూరైన బీమా పత్రాలను మంగళవారం కడవెండిలో 83 మందికి పంపిణీ చేసినట్టు ముదిరాజ్ సంఘం యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశబోయిన యాకన్న తెలిపారు. ఈ బీమాతో కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షలు, అంగవైకల్యం ఏర్పడితే రూ. 2.50 లక్షలు లబ్ధి చేకూరుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు మల్లేష్, సాయిలు, మలయ్య, రాజు, యాదగిరి, భిక్షపతి, కిష్టయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## సన్మానం



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో భిక్షంను స్ఫూర్తిగా తీసుకోవాలని సర్పంచ్ వీరమనేని యాకాంతరావు అన్నారు. మంగళవారం ఉన్నత పాఠశాలలో నైట్ వాచ్‌మెన్‌గా పని చేసిన భిక్షం పదవీ విరమణ సందర్భంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి భిక్షం రూ.10వేలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. హెచ్ఎం శోభారాణి, ఎంఎంసీ చైర్మన్ జీడి సమ్మయ్య, ఉపాధ్యాయులు రమేష్, ఉప్పలయ్య, బలరాంనాయక్, నర్సింహమూర్తి, అశోక్, దీప,విజయకుమారి పాల్గొన్నారు.

## జీపీ కార్మికులకు యూనిఫామ్ పంపిణీ

కొడకండ్ల: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు మంగళవారం సర్పంచ్ పసునూరి మధుసూదన్, ఎంపీటీసీలు కుందూరు విజయలక్ష్మి, నసీరుద్దీన్ యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. 20 మంది కార్మికులకు రెండు జతల చొప్పున వారు అందజేశారు. ఎంపీఓ శ్రీనివాస్, ఉపసర్పంచ్ రమేష్, వీరస్వామి, రాములు, హరీష్, షన్నా తదితరులు పాల్గొన్నారు.

### విద్యాశాఖ మంత్రికి వినతి

రఘునాథపల్లి: విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీతో అనుచితంగా వ్యవహరిస్తూ ఇబ్బందులు పెడుతున్న మండలంలోని నిడిగొండ ఉన్నత పాఠశాల హెచ్ఎం మంజులపై వెంటనే చర్య తీసుకోవాలని సర్పంచ్, ఉప సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్, గ్రామ పెద్దలు మంగళవారం విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. పాఠశాల సబార్డినేట్‌ను హెచ్ఎం అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టడంతో లాంగ్ లీవ్ తీసుకొని వెళ్లాడని, విద్యార్థులతో తరగతి గదులను శుభ్రం చేయించడం, నీళ్లు తెప్పించడం చేస్తున్నాడని తెలిపారు. మధ్యాహ్న భోజనం మెనూ పాటించక పాఠశాల నిధులు దుర్వినియోగం చేస్తూ ఉపాధ్యాయులను, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎస్ఎంసీ కమిటీని అవమానిస్తున్న హెచ్ఎంను వెంటనే బదిలీ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అదే విధంగా హెచ్ఎం తీరుపై ముఖ్యమంత్రి సీఎస్, మంత్రి కేటీఆర్‌కు ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఎస్ఎంసీ చైర్మన్ మేడ స్వామి తెలిపారు.

## సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న మారపాక రవి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జెడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంపై డివిజన్ కేంద్రంలో స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాల ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రజల ఉపాధి, ఉన్నతికి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పీఎంఈజీపీలో చిన్నతరహా పరిశ్రమల కోసం దరఖాస్తులు చేసుకోవాలని, జాతీయ, ప్రైవేట్ బ్యాంకుల నుంచి రుణం పొంది పరిశ్రమలను నెలకొల్పాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ కందుల రేఖ గట్టయ్య, డీఆర్‌డీఓ రాంరెడ్డి, ఏపీడీ నూరొద్దీన్, కేవీఐబీ నోడల్ అధికారి కె.అశోక్‌కుమార్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం కె.రమేష్, ఐకేపీ ఏపీఎం కవిత, కేవీఐసీ రిప్రజెంటేటివ్ రాజేష్, ఎల్‌డీఎం శ్రీధర్ పాల్గొన్నారు.

## పైపులైన్లు ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి



ఎండిపోతున్న పంటను చూపుస్తున్న బాధితరైతు

స్టేషన్‌ఘన్‌పూర్: తన వ్యవసాయ భూమి వద్ద అక్రమంగా పైపులైన్లు పగులగొట్టి విద్యుత్‌మీటర్, స్టార్టర్‌ను ధ్వంసం చేసిన వారిపై చట్టపరంగా తగిన చర్య తీసుకోవాలని బాధిత రైతు జోగు కుమారస్వామి డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపాడు. ఘన్‌పూర్ శివారు సర్వే నంబర్ 269/బీలో 1980 సంవత్సరంలో 3 ఎకరాల 20 గుంటల భూమి కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకుంటున్నట్లు చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాస్తులో తామే ఉన్నామని, అయితే 2017లో ధరణితో కొందరు వ్యక్తులు తన వ్యవసాయభూమిని అక్రమంగా పట్టా చేసుకుని ఆరేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇటీవల వారు తన వ్యవసాయభూమిలో పైపులైన్‌ను, త్రీఫేస్ విద్యుత్ మీటరు, స్టార్టర్‌ను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. దీంతో రూ.1లక్ష వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. స్టార్టర్, పైపులైన్లు తొలగించడంతో నీరు అందక వరిపంట ఎండిపోతుందని, ఈ విషయమై సీపీకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆయన కోరాడు.

### సవాళ్లను ఎదుర్కోవడంతో లక్ష్యం సులభం



పాలకుర్తి టౌన్: విద్యార్థులు, యువత సవాళ్లను ఎదుర్కోవడంతో లక్ష్యం సులభమవుతుందని 5ఈ లైఫ్ విజన్ సభ్యుడు గుగ్గిళ్ల రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత ఉన్నత పాఠశాలలో 5ఈ లైఫ్ విజన్ అంబాసిడర్లను ఎంపిక చేశారు. 18 వినూత్న ప్రశ్నలతో కూడిన చాంపియన్ ప్రొఫైల్‌ని డిజైన్ చేసి పలు అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. తనోజు, జి.అమృతసాయి చాంపియన్ ప్రొఫైల్ క్రియేట్ చేసినందుకు 5ఈ అంబాసిడర్లుగా ఎంపిక చేశారు. కాగా, వారికి హెచ్ఎం పి.శోభరాణి ప్రశంస పత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు ఓరుగంటి రమేష్, శోభరాణి, నరసింహమూర్తి పాల్గొన్నారు.